# కాంగ్రెస్, బీజేపీతో గిరిజనులకు అన్యాయం

- ఆ పార్టీల ఓటమే లక్ష్యంగా గిరిజనులు పనిచేయాలి
- మీడియాతో గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్



మహబూబాబాద్/జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 9(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని గిరిజన బిడ్డలకు కాంగ్రెస్, బీజేపీలే అన్యాయం చేశాయని, ఈ ఎన్నికల్లో ఆ రెండు పార్టీల ఓటమే లక్ష్యంగా గిరిజనులు పనిచేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. గురువారం మహబూబాబాద్‌లోని ఎంపీ మాలోత్ కవిత క్యాంపు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రాలో ఉన్న గిరిజనులను 1956లోనే ఎస్టీ జాబితాలో చేర్చారని, తెలంగాణలో ఉన్న గిరిజనులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి 20 ఏండ్ల సమ యం తీసుకొని చివరకు 1976లో చేర్చారని విమర్శించారు. అప్పటి సీఎం ఎన్టీఆర్ 4 శాతం ఉన్న ఎస్టీ రిజర్వేషన్ 6 శాతానికి పెంచారని గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ 6 శాతం ఉన్న ఎస్టీ రిజర్వేషన్లను 10 శాతానికి పెంచడం ద్వారా విద్య, ఉద్యోగాల్లో చాలా మందికి ప్రయోజనం చేకూరిందని మంత్రి పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 500 జనాభా ఉన్న తండాలు, గూడేలను గ్రామ పంచాయతీలు చేసిందని గుర్తుచేశారు. హైదరాబాద్ నడిబొడ్డున గిరిజన, ఆదివాసీ భవనాలను నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. అందుకు కృతజ్ఞతగా ఈ నెల 11న హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో గిరిజన ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాని కి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, ఆర్థిక మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, పరకాల శ్రీనివాస్‌రెడ్డి, కేఎస్ఎన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గురువారం భూపాలపల్లి అసెంబ్లీ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి నామినేషన్ వేశారు. ఆయన వెంట మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, ఎన్నికల ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఉన్నారు.



ఎమ్మెల్సీ కవిత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నవీపేట మండలం మద్దేపల్లికి చెందిన బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు

## బీఆర్ఎస్‌లోకి బీజేపీ నాయకులు

**ఆహ్వానించిన ఎమ్మెల్సీ కవిత**

నవీపేట, నవంబర్ 9 : కేసీఆర్ సర్కార్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నిజామాబాద్ జిల్లా నవీపేట మండలానికి చెందిన బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు గురువారం ఎమ్మెల్సీ కవిత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. భారత జాగృతి యువ నాయకుడు జాదవ్‌రాజ్ ఆధ్వర్యంలో బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు రమణ, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు నరేశ్‌తోపాటు మద్దేపల్లికి చెందిన 30 మంది బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు నిజామాబాద్‌లోని ఎమ్మెల్సీ కవిత నివాసంలో వారు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు కృషి చేస్తామని ప్రకటించారు.

- కేసీఆర్ లేకపోతే తెలంగాణ ఆగం



గురువారం రాత్రి కరీంనగర్‌లోని 28వ డివిజన్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ లేకపోతే తెలంగాణ కుక్కలు చింపిన విస్తరే అవుతుందని అన్నారు. -కరీంనగర్ కార్పొరేషన్

## నేను పక్కా లోకల్.. తుమ్మల నాన్‌లోకల్

**ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**



ఖమ్మం, నవంబర్ 9: తాను ఖమ్మం లో కల్ అని, కాంగ్రెస్ అభ్యర్థి నాన్‌లోకల్ అని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమా ర్ స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలోని ఎంబీ ఫంక్షన్ హాల్‌లో గురువారం స్థానికుడు మేకల భిక్షమయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీ య సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తుమ్మల గతంలో ఎక్కడెక్కడ పోటీ చేశారో, ఎక్కడెక్కడ రాజకీయాలు చేశారో ప్రజలు గమనించాలని సూచించారు. తానెప్పుడూ ఖమ్మంలోనే ఉన్నానని స్పష్టం చేశారు. తన హయాంలో జరిగిన అభివృద్ధిని తుమ్మల చేసినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. గెలిచినా, ఓడినా తాను ఖమ్మంలోనే ఉంటానని స్పష్టం చేశారు. తుమ్మల ఎక్కడ ఉంటారో ప్రజలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలేరులో చెల్లని రూపాయి.. ఖమ్మంలో చెల్లుతుందా? అని ప్రశ్నించారు. పాలేరు వాసులు తుమ్మలను పక్కన పెట్టారని, ఇప్పుడు ఏం ముఖం పెట్టుకుని ఖమ్మం నుంచి పోటీ చేస్తున్నారని ప్రశ్నించారు. ఓడిపోతాననే భయంతో తుమ్మల తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలు ఓటుతోనే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## భారీ ఎత్తున నగదు బదిలీ

- డోర్నకల్ మండలంలోని కొందరి ఖాతాల్లో జమ
- హైదరాబాద్‌లోని ఓ బ్యాంకు నుంచి ట్రాన్స్‌ఫర్

డోర్నకల్, నవంబర్ 9: హైదరాబాద్‌లోని ఓ బ్యాంకు నుంచి మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని కొంతమంది వ్యక్తుల అకౌంట్లలో భారీ ఎత్తున నగదు జమ అయినట్టు స్థానికంగా చర్చనీయాంశమైంది. ఒక్కొక్కరి అకౌంట్‌లో సుమారు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు నగదు బదిలీ జరిగినట్టు తెలుస్తున్నది. ఈ విషయంపై డోర్నకల్ సీఐ ఉపేందర్ రావును వివరణ కోరగా.. అనుమానితుల అకౌంట్లను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. బొడ్రాయి తండాకు చెందిన టీ రామ్మూర్తి అకౌంట్‌లో రూ.7 లక్షలు జమ అయినట్టు గుర్తించి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. మిగతా వారి సమాచారం సేకరిస్తున్నట్టు పేర్కొన్నారు.





